ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీకాకుళం


జిల్లా వార్తలు

బుధవారం 25 సెప్టెంబరు 2024



డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, సెప్టెంబరు 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో 2018,2019 విద్యాసంవత్సరంలో చేరిన ఓల్డ్ రెగ్యులేషన్ విద్యార్థుల ఆరో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్టు డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం జనరల్, కంప్యూటర్స్ బీసీఏ కోర్సుల్లో మొత్తం 1,154మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయగా, 822 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఫలితాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా 15 రోజుల్లో పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



నామినేటెడ్ సందడి

- జిల్లాకు రెండు కార్పొరేషన్ చైర్మన్ పదవులు
- మరో ఇద్దరికి డైరెక్టర్లుగా అవకాశం
- రెండో జాబితాపై మరికొందరి ఆశలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టుల సందడి నెలకొంది. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులకు నామినేటెడ్ పోస్టులను కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్లకు చైర్మన్లను, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో భాగంగా తొలిజాబితాలో జిల్లాకు రెండు కార్పొరేషన్ చైర్మన్లు, రెండు డైరెక్టర్ పదవులు లభించాయి. టీడీపీ శ్రేణులకు మూడు పదవులు, జనసేన నాయకుడికి ఒక పదవి దక్కింది.

● ఆశావహుల ఎదురుచూపులు

జిల్లాలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మాత్రం నామినేటెడ్ పోస్టుల రెండో జాబితా కోసం తీక్షణంగా ఎదురుచూస్తున్నారు. ఇందులో కీలక పదవులన్నీ ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 'శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ' (సుడా) చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్, కళింగ కార్పొరేషన్.. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్‌లు.. డీసీసీబీ వంటి పదవులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాల్సి ఉంది. అలాగే దేవస్థాన పాలకమండలి, యూనివర్శిటీ సిండికేంట్ మెంబర్ వంటి పోస్టులు కూడా భర్తీ చేయాల్సి ఉంది. వీటిపై పదిమంది వరకు టీడీపీ నాయకులు గంపెడాశతో ఉన్నారు. ఈ మేరకు దరఖాస్తులను, పార్టీలో వారు అందించిన సేవలను.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ పెట్టిన కేసులను ఎదుర్కొన్నవారు.. ఇటువంటి వివరాలన్నింటినీ టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి రెండు నెలల కిందట పంపించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు.. తమకు తెలిసిన ఇతర జిల్లాల నాయకులతోనూ నామినేటెడ్ పోస్టులపై సిఫార్సు చేయించుకున్నవారు అధికంగా ఉన్నారు. ఎవరికివారు ఫలానా పదవి తమకే వస్తుంది.. తమకే పార్టీ నాయకుల ఆశీస్సులు ఉన్నాయని భావిస్తున్నారు. రెండో జాబితా అతిత్వరలో విడుదల కానుండటంతో నాయకుల్లో ఉత్కంఠ రేగుతోంది.



ఏపీటీపీసీ చైర్మన్‌గా బాబూరావు

పలాస: టీడీపీ సీనియర్ నేత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావును.. ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. జిల్లాలో కళింగ సామాజిక వర్గానికి చెందిన బాబూరావుకు నామినేటెడ్ పోస్టుల్లో మొదటి జాబితాలోనే పదవి రావడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ప్రథమ చైర్మన్‌గా ఆయన వ్యవహరించారు. 1994లో రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పట్లో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావుపై.. కాంగ్రెస్‌పార్టీ తరపున టెక్కలి నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. 2002లో మునిసిపల్ చైర్మన్‌గా వ్యవహరించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో పలాస బరిలో వైసీపీ నుంచి పోటీ చేశారు. 2017 సంవత్సరం నుంచి టీడీపీలో చేరి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల సార్వత్రిక పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు విజయానికి విశేషంగా కృషి చేశారు.



మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా ఆనెపు

● ఆమదాలవలస నియోజకవర్గం బూర్జ మండలానికి చెందిన కీలక టీడీపీ నాయకులైన ఆనెపు రామకృష్ణనాయుడు... ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ పేరిట పోరాటం నిర్వహిస్తూ పంచాయతీలకు నిధులు కేటాయింపుపై గత ప్రభుత్వ హయాంలో నిరసన చేపట్టారు. ఈయనకు ప్రస్తుతం 'ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్' డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. అయితే ఈ పదవి తన గుర్తింపునకు చిన్నదని.. అప్రాధాన్యమైదని.. దీనిపై సుముఖత లేనట్లు సన్నిహితుల వద్ద రామకృష్ణనాయుడు వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం.



రమణయ్యకు చాన్స్

శ్రీకాకుళం మండలానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు.. శీర రమణయ్యకు 'ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్‌గా నియమించారు.



జనసేన నుంచి తమ్మిరెడ్డి

జిల్లాతో అనుబంధమున్న తమ్మిరెడ్డి శివశంకర్ స్వగ్రామం పార్వతీపురం మన్యం జిల్లా జియమ్మవలస మండలం పెద్దబుడ్డిడి గ్రామం. ఆయన ఉన్నత చదువు అభ్యసించి కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్‌గా కొలువు సాధించారు. రెండు దశాబ్దాల కిందట ఆయన శ్రీకాకుళంలో నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి.. వారు ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన సహకారాన్ని అందించారు. ఐదేళ్ల సర్వీసు ఉండగానే ఉద్యోగానికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఆయనను ప్రభుత్వం ఇప్పుడు 'ఆంధ్రప్రదేశ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్'కు చైర్మన్‌గా నియమించింది. దీంతో జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంకెన్నాళ్లీ పాట్లు

- అధ్వానంగా రహదారులు
- ప్రయాణికులకు తీరని కష్టాలు



సరుబుజ్జిలి పెట్రోల్ బంకు సమీపంలో ప్రధాన రహదారి దుస్థితి

(సరుబుజ్జిలి)

శ్రీకాకుళం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు అంతర్రాష్ట్ర రహదారిగా గుర్తింపు పొందిన అలికాం-బత్తిలి (ఏబీ) రోడ్డు కష్టాలు ఇంకెన్నాళ్లంటూ వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులకు నరకాన్ని చూపించింది. ప్రస్తుతం ప్రభుత్వం మారినా.. ఈ రహదారి దుస్థితి మాత్రం మారడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి ఏబీ రోడ్డు 17వ కిలోమీటరు నవలాపురపు జంక్షన్ నుంచి 21వ కిలోమీటరు బొర్రంపేట వరకు చెరువులను తలపించేలా భారీ గుంతలు ఉండడంతో ప్రతిరోజూ వాహనాలు కూరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వాహనాలు కూడా ఇదే మార్గంలో అధికంగా రాకపోకలు సాగిస్తుండడంతో.. అవి కొన్ని సందర్భాల్లో గుంతల్లో నిలిచి ట్రాఫిక్ అంతరాయం నెలకొంటోంది. ఈ ప్రాంతంలో రహదారి అభివృద్ధి పనులకు గతేడాది నవంబరు 1న అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం సరుబుజ్జిలి ఎంపీడీవో కార్యాలయం వద్ద శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కానీ ఇప్పటివరకూ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. దీంతో ఈ రహదారి మరింత దారుణంగా గుంతలమయంగా మారింది.

● ఇటీవల సరుబుజ్జిలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఈ రహదారిలో ఉన్న ఒక కల్వర్టు పూర్తిగా కుంగిపోయింది. దీంతో ప్రధాన రహదారిపై భారీ స్థాయిలో నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ నుంచే రోడ్లు భవనాలశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మరుసటి రోజే కల్వర్టు ప్రాంతాన్ని యథాతథంగా తయారు చేసిన అధికారులు ఇప్పటివరకు రహదారి పనులను ప్రారంభించలేదు.

● ప్రస్తుతం సరుబుజ్జిలి పెట్రోల్ బంకు వద్ద ఒక కల్వర్టు పూర్తిగా కుంగిపోయి నీరు ప్రధాన రహదారిపైకి రావడంతో ఆ ప్రాంతమంతా జలమయంగా మారి భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల షలంత్రి గ్రామం వద్ద ఒక కల్వర్టు కుంగిపోయింది. రాకపోకలకు అంతరాయం కలిగితే తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు ఆ కల్వర్టును తొలగించి కొత్తగా పైపులు వేశారు. ప్రస్తుతం కొత్తకోట, తమ్మినాయుడుపేట జంక్షన్ల మధ్య కూడా ఏపీ రహదారిపై ఉన్న కల్వర్టు మధ్యలో కుంగిపోయి భారీ రంధ్రం ఏర్పడడంతో స్థానికులు అక్కడ ఎటువంటి వాహనాలు దిగిపోకుండా ఎర్రజెండాను ఏర్పాటు చేశారు. ఇలా ఎక్కడికక్కడ రహదారులు గోతులమయంగా కావడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అలికాం-బత్తిలి రహదారి పూర్తి అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.



కొత్తకోట సమీపంలో ఏబీ రహదారి మధ్యలో కుంగిన కల్వర్టు



సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారి ఇలా..

24 గంటల్లో భారీ వర్షాలు

- అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 24: 'రానున్న 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని నదులు, వాగుల్లో ప్రవాహం పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వంతెనలపై నీరు ప్రవహించే చోట్ల ప్రజల రాకపోకలు నియంత్రించాలని ఆదేశించారు. తీరప్రాంత మండలాల్లో మత్స్యకారులు.. సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీకాకుళంలో కంట్రోల్ రూమ్ నెంబర్ **(08942-240557)**కు ప్రజలు అత్యవసర సమయంలో ఫోన్ చేయాలని, సిబ్బంది వెంటనే అప్రమత్తమై తగు సహాయం చేస్తారని తెలిపారు. గండ్లు పడే అవకాశం ఉన్న చెరువులు, కరకట్టలు, కాలువలపై నిఘా ఉంచి ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించి.. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో ప్రభుత్వాధికారులకు సెలవులను రద్దు చేశామని, అధికారులంతా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

ఇద్దరు హోంగార్డులు సస్పెన్షన్

- మరో ఐదుగురుకి నెల రోజులపాటు..

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 24: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు హోంగార్డులను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సస్పెండ్ చేశారు. కొద్దిరోజులుగా జిల్లాలోని హోంగార్డుల పని తీరును ఎస్పీ పరిశీలించారు. గతంలో ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే కొంతమంది హోంగార్డులు అడ్జస్టమెంట్ కింద విధులకు డుమ్మా కొడుతున్న విషయాన్ని గుర్తించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారి జాబితా సిద్ధం చేసుకున్నారు. ఇటీవల 17మంది హోంగార్డులకు నోటీసులు జారీ చేశారు. అయినా వారి పనితీరులో మార్పు రాకపోవడంతో మంగళవారం ఇద్దర్ని సస్పెండ్ చేశారు. మరో ఐదుగురుని నెల రోజులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● గత ఎస్పీ రాధిక హయాంలో పాత బస్టాండ్ వద్ద పోలీసు పెట్రోల్ బంక్‌లో హోంగార్డులకు విధులు కేటాయించడంతో సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని హోంగార్డులు కలిసి.. విధులు మార్చాలని కోరారు. ఈ విషయాన్ని గత ఎస్పీకి మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో పెట్రోల్ బంక్‌లో హోంగార్డుల విధులను ఎస్పీ రద్దు చేశారు. దీనిపై హోంగార్డులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జూన్ నాటికి పోర్టు పూర్తిచేస్తాం

- మూలపేటలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకూ కృషి
- భోగాపురం పోర్టు వరకు 8లేన్ల రహదారి
- రీ సర్వే చేసి నిర్వాసితులకు న్యాయం చేస్తా
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, సెప్టెంబరు 24: వచ్చే ఏడాది జూన్ నాటికి మూలపేట పోర్టులో తొలి ఓడ ల్యాండింగ్ అయ్యేలా లక్ష్యం నిర్ణయించామని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం మూలపేటలో నిర్వాసితులతో ఆయన సమావేశమాయ్యరు. 'రానున్న జూన్ నాటికి షిప్‌లు ఆగేలా యుద్ధప్రాతిపదికన పోర్టు పనులు పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాకు, కలెక్టర్‌కు ఆదేశించారు. అందుకు అనుగుణంగా నిర్వాసితుల సమస్యల పరిష్కరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశాం. పోర్టు ఏర్పాటుకు మూలపేట, విష్ణుచక్రం గ్రామస్థులు 365 ఎకరాల భూమి ఇచ్చారు. ఈ ప్రాంతంలో 2,326 ఎకరాలు కేంద్ర ప్రభుత్వం ఉప్పు భూములు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చర్చించడంతో ఈ భూములు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. మూలపేట పోర్టు నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు 8 లేన్ల రహదారి వేసేందుకు సీఎం చంద్రబాబు సుముఖంగా ఉన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతానికి పరిశ్రమలతోపాటు టూరిజం అభివృద్ధి చెంది వలస నివారించవచ్చు. గతంలో కాకరపల్లి తంపరలో నిర్మించతలపెట్టిన థర్మల్ పవర్ ప్లాంట్ నిలిచిపోయిందని సంబంధిత యజమానులు బ్యాంక్‌లకు డబ్బులు చెల్లించలేదు. దీంతో వేలంలో వేరేవారికి ఆ భూములు వెళ్లాయి. వారితో మాట్లాడి ఆ భూములు కూడా వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవతో మూలపేటలో ఎయిర్‌పోర్టు కూడా మంజూరయ్యేలా కృషి చేస్తున్నామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు.

● 'గ్రామంలో భూ సర్వేలో అక్రమాలు జరిగాయి. నాకు 9.90ఎకరాలు ఉండగా.. కేవలం 2ఎకరాలు మాత్రమే చూపించారు. కొంతమంది అధికారులు కుమ్మక్కై భూములు తక్కువ ఉన్నవారికి ఎక్కువ ఉన్నట్లు చూపించి నిధులు దోచేశారు' అని కోట నారంనాయుడు మంత్రి అచ్చెన్నకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లోగా మళ్లీ మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో వారం రోజుల్లో రీ సర్వే చేసి అందరికీ న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కొత్త సిబ్బందితో రీసర్వే చేయిస్తామని స్పష్టం చేశారు.

● 'పీడీఎఫ్‌లో చాలా అక్రమాలు జరిగాయి. నిర్వాసితులకు అందించిన పీడీఎఫ్‌లు గ్రామ సభలో బహిర్గతం చేయాలి' అని మాజీ సర్పంచ్ జీరు భీమారావు కోరారు. నౌపడలో తమకు కేటాయించిన ఆర్అండ్ఆర్ కోలనీ ముంపు సమస్య ఉందని, అక్కడ ఉప్పునీరే పడుతుందని తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలో నిర్వాసితుల కాలనీని పరిశీలించి.. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏ ఒక్క నిర్వాసితుడు నష్టపోకుండా న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, టెక్కలి ఆర్డీవో సుదర్శన్ దొర, కింజరాపు హరివరప్రసాద్ పాల్గొన్నారు.

అధికారులకు నిలదీత

గత ప్రభుత్వంలో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరించి అర్హులైన నిర్వాసితులకు అన్యాయం చేశారని మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో మాజీ సర్పంచ్ జీరు భీమారావు, కోట నారంనాయుడు, సుందరరావు అధికారులను నిలదీశారు. 'ఇళ్ల నష్టపరిహారాన్ని వైసీపీ సానుభూతిపరులకు ఎక్కువ మొత్తంలో ఇచ్చారు. టీడీపీ వారికి అన్యాయం చేశారు. గ్రామంలోని పోరంబోకు భూముల్లో జీడిమొక్కకు 5వేల చొప్పున వైసీపీ వారికి నష్ట పరిహారం ఇచ్చిన అధికారులు.. తమకు ఎందుకు ఇవ్వలేదని గ్రామస్థులు నిలదీశారు. పోర్టు యాజమాన్యం ఇచ్చిందని అధికారుల చెప్పగా ఎవరిచ్చినా అందరికీ ఒకే విధంగా న్యాయం జరగాలి కదా? అంటూ మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.

● 'మూలపేట పోర్టు నిర్వాసితులకు ఇప్పటివరకూ రూ.72.84 కోట్ల పరిహారం అందించాం. ఇంకా పలువురు రైతుల నుంచి భూ సేకరణకు సంబంధించి రూ.6.60కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉంద'ని అధికారులు మంత్రి అచ్చెన్నాయుడుకు వివరించారు.





నిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సబ్ జైళ్ల పరిశీలన

నరసన్నపేట/పాతపట్నం, సెప్టెంబరు 24: నరసన్నపేట, పాతపట్నం సబ్ జైళ్లను జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా మంగళవారం పరిశీలించారు. సబ్ జైళ్లలో ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఉచిత న్యాయసేవలను వినియోగించుకోవాలని, హింసను విడనాడాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి సన్యాసినాయుడు, జూనియర్ న్యాయాధికారులు హరిప్రియ, మానెం రోషిణి, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



పాతపట్నం: సబ్ జైల్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జేపీ మౌలానా



అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

నౌపడా ఆర్.ఎస్ రైల్వేగేటు సమీపంలో.. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. మంగళవారం ఉదయం టెక్కలి డిపో నుంచి పూండి- పలాస వెళ్లే ఆర్టీసీ బస్సు 30మంది ప్రయాణికులతో పయనిస్తోంది. నౌపడ ఆర్ఎస్ సమీపంలో ఎదురుగా గొర్రెల మంద రావడంతో వాటిని తప్పించబోయి.. రోడ్డు పక్కన పైపులైన్ల నిర్మాణం కోసం తవ్విన గోతిలో దిగబడింది. ఆ సమీపానే.. ఎదురుగా 13కేవీ లైన్ విద్యుత్ స్తంభానికి కొంచెం తగిలి.. బస్సు నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టి ఉంటే పెను ప్రమాదం జరిగేదని ప్రయాణికులు పేర్కొన్నారు. డ్రైవర్ అప్రమత్తతతో వ్యవహరించి బస్సు నిలిపేయడంతో తమకు ఎటువంటి ప్రమాదం జరగలేదని ఊపిరిపీల్చుకున్నారు.

- టెక్కలి/ సంతబొమ్మాళి

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

పాముకాటుతో వృద్ధుడి మృతి

జి.సిగడాం: మండలంలోని టంకాల దుగ్గివలసకు చెందిన టంకాల రాము (56) పాముకాటువేయడంతో మృతి చెందాడు. గ్రామస్థుల కథనం మేరకు.. అయ్యారిపేటలో గల వరిపంట పొలంలో మంగళవారం ఎరువు చల్లుతుండగా రాముకు నాగుపాము కాటు వేయడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రైతులు ఆటోలో పొందూరు సీహెచ్‌సీకి తరలిస్తుండగా మృతిచెందాడు. రాముకు భార్య అన్నపూర్ణ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. జి.సిగడాం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

తాడివలస పాఠశాలలో పాము కలకలం

పొందూరు: తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాము కలకలం రేపింది. మరుగుదొడ్లకు వెళ్లిన విద్యార్థులకు తలుపుపై పాము కనిపించడంతో భయాందోళనకు గురై ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయులు పామును బయటకు వెళ్లిపోయేందుకు చర్యలు తీసుకున్నారు. వర్షాకాలం కావడంతో సర్పాలు వస్తున్నాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఎం బి. కంఠయ్య తెలిపారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన వంజరాపు సన్యాసి అత్యాచారయత్నానికి పాల్పడ్డారని ఫిర్యాదుపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం గ్రామసమీపంలోని తోటకు బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా సన్యాసి బలవంతంచేశాడని, తప్పించుకునే ప్రయత్నంలో గాజులు విరిగిపోయి, దుస్తులు చిరిగిపోయాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను తప్పించుకునే ప్రయత్నంలో కేకలు వేయగా తన మరిది వచ్చి సన్యాసిని మందలిస్తుండగా వారిద్దరి మధ్య ఘర్షణ జరిగిందని ఫిర్యాదుచేశారు. ఈనేపథ్యంలో తన మరిదిపై దాడిచేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. తాను ఇంటికి వచ్చి విషయం భర్తకు తెలియజేసి న్యాయంచేయాలని కోరానని ఆ ఫిర్యాదులో తెలిపారు. కాగా ఇరు కుటుంబాల మధ్య ఎప్పటి నుంచో పాతకక్షలు ఉన్నాయని, తన కుమారుడు సన్యాసిరావుపై తప్పుడు ఆరోపణలతో సదరు కుటుంబసభ్యులు మంగళవారం దాడికి పాల్పడ్డారని, ఘర్షణను అడ్డుకున్న తనపై కూడా దాడికి పాల్పడ్డారని ఆయన తల్లి గడ్డెమ్మ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

కూలిన నారాయణబట్టి కల్వర్టు

● ఎంఎస్‌పల్లి వైపు నిలిచిపోయిన రాకపోకలు


కల్వర్టు కూలిపోయిన దృశ్యం

కంచిలి: కంచిలి నుంచి అంపురం మీదుగా ఘాటి ముకుందపురం వెళ్లే రహదారిలో నారాయణబట్టి వద్ద ఉన్న కల్వర్టు మంగళవారం ఉదయం అకస్మాత్తుగా కూలిపోయింది. ఉదయం జన సంచారం లేని సమయంలో కల్వర్టుకు పగుళ్లు రావడంతో అప్రమత్తమైన స్థానికులు వాహనాల రాకపోకలను నిలిపివేసి అధికారులకు సమాచారం ఇచ్చారు. కొంత సమయం తర్వాత ఒక్కసారిగా కల్వర్టు కూలిపోయింది. దీంతో ఎంఎస్‌పల్లి వైపు వెళ్లే గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం జాతీయరహదారి పక్కనుంచి కేశరిపడ మీదుగా తాత్కాలికంగా రాకపోకలు సాగిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈ రామినాయుడు, ఏఈఈ మోహనరావుతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని రాకపోకలు పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ రహదారి అభివృద్ధితోపాటు కల్వర్టు నిర్మాణానికి టీడీపీ హయాంలోనే ప్రతిపాదనలు సిద్ధంచేశామని, వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ వల్ల నిధులు వెనక్కి మళ్లాయన్నారు. ప్రస్తుతం రూ.4.99 లక్షలతో తాత్కాలికంగా పనులు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.

ఇసుక తరలింపుపై వాగ్వాదం


పోలీసులు, రెవెన్యూ అధికారులతో వాగ్వాదం చేస్తున్న యువకులు

ఆమదాలవలస: మండలంలోని నిమ్మతొర్లాడ, పాతూరు, చేపేనపేట సమీపంలో ఇసుకతరలింపునకు సంబంధించి మంగళవారం రెవెన్యూఅధికారులు, గ్రామస్థుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.ఇటీవల ఈ మూడుగ్రామాల పరిధిలో నాగావళి నదీ పరివాహ ప్రాంతంలో ఉన్న ఇసుక పోగులను రెవెన్యూ అధికారులు గుర్తించి సీజ్‌చేశారు. తర్వాత రెవెన్యూఅధికారులు ఇసుకపోగులను గనులశాఖ అప్పగించారు. దీంతో ఇసుకను గనులశాఖ అధికారులు తరలించి గృహలబ్ధిదారులకు అందించడానికి యంత్రాలను తీసుకురాగా, ఆ మూడుగ్రామస్థులు అడ్డుకున్నారు.దీంతో పలు గ్రామాల వద్ద నాగావళి నదీతీరం ఆనుకొని ఎన్నో ఇసుక పోగులు ఉన్నాయని, వాటిని ముందు తరలించిన తర్వాత తమ గ్రామాల నుంచి ఇసుక తీసుకెళ్లాలని రెవెన్యూ అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీనితో అధికారులు చేసేది లేక ఇసుకను ప్రభుత్వ గృహనిర్మాణాలకు వినియోగించుకోవాలని గ్రామస్థాయి అధికారులకు అప్పగించి వెళ్లిపోయారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

● ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో వద్ద అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

ఎచ్చెర్ల: జిల్లాలో వైన్‌షాపుల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు ఈమేరకు మంగళవారం ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపో వద్ద ఆందోళన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 500 మంది సిబ్బంది బాట్లింగ్ డిపో ఎదుట ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు రాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నూతన మద్యం విధానం తీసుకువస్తుండడంతో తామంతా రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు న్యాయం చేయాలని ఐఎంఎల్ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా సంఘం నేతలు బి.ధర్మారావు, బి.శ్రీను, గురివిబాబు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు: వీసీ

ఎచ్చెర్ల: డ్రోన్ టెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో పరిశోధన అభివృద్ధి కేంద్రం, రోసిన్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన ఇన్నోవేటివ్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ (ఐసీడీటీ)తో కలిసి ఐదురోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు.ఐసీడీసీ ఆపరేషనల్ హెడ్ పి.సాయినాథ్, మనోహర్, ఆర్‌అండ్‌డీ ఇంజనీర్లు కె.జ్యోతి, వి.పావని మాట్లాడుతూ ఈ తరహా శిక్షణ పూర్తిచేసినవారికి టెలికాం, భవన నిర్మాణాలు, రక్షణ, వ్యవసాయం తదితర రంగాల్లో ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, డీన్ ఎస్.లోకేశ్వరి, సహాయ డీన్ ఎస్.మధులత, ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ గ్రీన్‌క్యాంపస్ లక్ష్యంగా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సు జాత, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనూరాధ, పీవోలు తాతారావు, అరుణ, భవాని పాల్గొన్నారు.

● **సోంపేట:** స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం పురస్కరించుకుని స్వచ్ఛభారత్‌నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు ఎ.రామినాయుడు, ఎం.ప్రసాద్, అధ్యాపకులు పి.రజనీకుమారి, టి.యుగంధర్, టి.ప్రవీణ్, ఆర్.కల్పన, సంధ్యారాణి పాల్గొన్నారు.

● **గుజరాతీపేట:** నిస్వార్థమైన సేవే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎన్‌ఎస్‌ఎస్ డే కార్య క్రమం నిర్వహించారు. తొలుత కళాశాలలో ఆర్వో ప్లాంటును ప్రారంభించారు.

సొంత భవనాలు లేక.. సౌకర్యాలకు నోచుకోక

● కలగా మిగిలిన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు
● ఇదీ ఎల్.ఎన్.పేట మండలంలో పరిస్థితి


పలు శాఖలు నిర్వహిస్తున్న ఎంపీడీవో కార్యాలయం

ఎల్.ఎన్.పేట: ఎల్ఎన్‌పేట మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతోపాటు సౌకర్యాలకు నోచుకోకపోవడంతో ప్రజలు, అధికారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ మండలం ఏర్పడినప్పటి నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా పోలీసుస్టేషన్, వ్యవసాయశాఖ వంటి ప్రధాన రంగాలకు కార్యాలయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండల వ్యవస్థ రూపకల్పన సమయంలో జిల్లాలో 37 మండలాలను ఏర్పాటుచేశారు. అప్పటికి ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గంలోని సరుబుజ్జిలి మండలంలోగల 19 పంచాయతీలను విడదీసి 38వ మండలంగా 2001 మే నెల 24న ఎల్ఎన్‌పేట మండలం ఏర్పాటు చేశారు. మండలం ఏర్పడిన తర్వాత సుమారు రెండేళ్ల వరకు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు అద్దెభవనాల్లోనే కొనసాగాయి. 2003లో మండలపరిషత్‌కు, ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి సొంతభవనాలు అందుబాటులోకి వచ్చాయి. మండలం ఏర్పాటు చేసినా తర్వాత ప్రజలకు దూరం తగ్గడమే కాకుండా అన్ని సౌకర్యాలతో ప్రజలకు పాలనా సౌలభ్యం కలుగుతుందని ఎంతగానో ఆశించారు. ఇప్పటివరకు ప్రజలు ఆశలుగానే మిగిలిపోయాయి. రెండు దశాబ్దాలు గడుస్తున్నా మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పోలీస్ స్టేషన్ ఏర్పాటు కలగా మిగిలింది. ఇక్కడ స్టేషన్ లేకపోవడంతో ఏ చిన్న సంఘటన జరిగినా 15 కిలోమీటర్ల దూరంలో గల సరుబుజ్జిలి స్టేషన్‌కు వెళ్లక తప్పడంలేదు. బొర్రంపేట నుంచి స్కాట్‌పేట వరకు 15 కిలోమీటర్లు అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుకు విస్తరించి ఉంది. ఈ రహదారిలో నిరంతరం ఏదోఒకచోట ప్రమాదం జరుగు తోంది. దీనికితోడు వంశధార ప్రాజెక్టు నిర్వాసితులు పునరావాసకాలనీలతో జనాభా పెరిగింది. ఈనేపథ్యంలో పోలీస్‌స్టేషన్ దూరంగా ఉండడంతో సంఘటనా స్థలానికి సకాలంలో పోలీసులు చేరుకోలేకపోతున్నారు. మండలపరిషత్‌కార్యాలయంలోనే ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, విద్య, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఉద్యోగులు విధి నిర్వహణలో ఇబ్బందిపడడమే కాకుండా నిత్యం ప్రజలతో కార్యాలయం రద్దీగా ఉంటోంది. ప్రధానంగా కీలకమైన వ్యవసాయశాఖకు సొంతభవనం లేకపోవడంతో కీలక సమయాల్లో ఇబ్బందిపడవలసి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

● జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభం


పాతపట్నం: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు


పోలాకి: మాట్లాడుతున్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. మంగళవారం జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు.

● **రణస్థలం:** రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సేద్యంలో నూతన పద్ధతులను పాటించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. కోష్టలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో డీడీఏ త్రినాథస్వామి, కూటమి నాయకులు లంక శ్యామలరావు, జగన్నాథంనాయుడు, పైడి అప్పడదొర, అనిరినాయుడు, బసవ గోవిందరెడ్డి, ముక్కు ఆదినారాయణ, వడ్డాది శ్రీనివాసరావు, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో విజయభాస్కరరావు పాల్గొన్నారు.

● **గార:** కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శాలిహుండంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రకృతి సేద్యానికి సంబంధించి కషాయం తయారు చేసే విధానం పరిశీలించారు.

● **పోలాకి:** రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి తెలిపారు. మబగాంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్.నీలవేణి, ఏడీఏ రవీంద్రభారతి, ఏవో చిరంజీవి, ఏహెచ్ పద్మప్రియ పాల్గొన్నారు.

● **పాతపట్నం:** ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రాధాన్యం స్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు.చంగుడిలో పొలంపిలు స్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు.


రణస్థలం: పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


గార: కషాయం తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న గొండు శంకర్

రఘురామకృష్ణంరాజును అరెస్టు చేయాలి

అరసవల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించేసిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు.మంగళవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.శ్రీకాకుళంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టి, డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మను ఊరేగించి దగ్ధంచేశారు.కార్యక్రమంలో కళ్లేపల్లి రామ్ గోపాల్, తైక్వాండో శ్రీను, కంఠవేణు, గుజ్జల గురుమూర్తి, సింకు రమణ, ఆరిబారిక రాజు, నేతల అప్పారావు, రామారావు, మహేష్, అబ్బాస్, పెయ్యల చంటి, భూషణ్, శంకర్, పంకు మహేష్, మణి, శీర రాజేశ్వరి, నీలాపు హారతి పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి


కమిషనర్‌కు లేఖ ప్రతిని అందజేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం: మునిసిపాలిటీ పరిధిలోని ఒకటి, రెండు వార్డుల్లో గల కాలనీలకు విద్యుత్‌సౌకర్యం కల్పించాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు నందికి జాని, టీడీపీ నాయకుడు గాలి పాపారావు కోరారు. ఈమేరకు మంగళవారం ఎమ్మెల్యే అశోక్ రాసిన లేఖ ప్రతిని కమిషనర్‌కు అందజేశారు. ఒకటి, రెండు వార్డుల పరిధిలోని బృందావన్‌కాలనీలో విద్యుత్ సౌకర్యం కోసం రూ.2,88,670 తో ప్రతిపాదనలు సిద్ధంచేసినట్లు వారు తెలిపారు. రానున్న సమావేశంలో అజెండాలో చేర్చి, విద్యుత్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయంగా పనిచేయాలి

అరసవల్లి: స్వర్ణాంధ్ర-2047 సాధనే ధ్యేయంగా పనిచేయాలని నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళంలోని రైతుబజార్ సచివాలయ పరిధిలో గల 12వ డివిజన్‌లో స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కోశాధికారి ఇప్పిలి తిరుమలరావు, సచివాలయ అడ్మిన్ పైడి తులసి, సిబ్బంది రాంబాబు, చిన్నబాబు, పవన్, త్రివేణి శంకర్, ఝాన్సీ, భాగ్యలక్ష్మి, జగన్ పాల్గొన్నారు.

రైల్వే యూజర్స్ కమిటీ అధ్యక్షుడిగా గణపతి

సోంపేట: బారువ రైల్వేస్టేషన్ యూజర్స్ కమిటీ అధ్యక్షుడిగా రాంబుడ్డి గణపతిని ఎన్నుకున్నారు. ఈమేరకు కొర్లాంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షురాలిగా వై.రజని, ప్రధానకార్యదర్శిగా రత్నాల శ్రీనివాసరావు, కన్వీనర్‌గా మడ్డు కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సుస్థిరాభివృద్ధికి ముందుకురావాలి: వీసీ

ఎచ్చెర్ల: రాష్ట్ర ప్రభుత్వం విజన్ స్వర్ణాంధ్ర -2047 సాధనకోసం సుస్థిరాభివృద్ధికి ముందుకు రావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని కోరారు.మంగళవారం వర్సిటీలో 12 ప్రగతిదాయక అంశాలతో కూడిన బ్రోచర్‌ను జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వీఎస్‌ఎస్‌ఎల్ ప్రసన్నతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ గణాంకాధికారిణి వి.శ్రీదేవి, వర్సిటీ ఓఎస్‌డీ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు.

టోల్ ఫీజుకు మినహాయింపు ఇవ్వాలి

కవిటి: కరాపాడు జాతీయరహదారి వద్ద ఉన్న టోల్‌ప్లాజాలో స్థానికంగా ఉండే వాహనాలకు టోల్‌ఫీజు నుంచి మినహాయింపుఇవ్వాలని డ్రైవర్లు కోరారు. మంగళవారం నిరసన తెలిపారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి తరచూ ప్రయాణించే నాలుగుచక్రాల వాహనాలకు ఆధార్‌కార్డు ఆధారంగా మినహాయింపుఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శంకరరెడ్డి పాల్గొన్నారు.

ప్యాసింజర్లకు హాల్ట్ కల్పించండి

కవిటి: జాడుపూడి ఆర్‌ఎస్‌లో రైలు నిలయంలో ప్యాసింజరు రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలని టీడీపీ మండలాధ్యక్షుడు మణిచంద్రప్రకాష్, సంతోష్ పట్నాయక్ కోరారు.ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. జాడుపూడి రైలునిలయంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

తిరుమల ప్రతిష్టను దెబ్బతీస్తున్న ప్రభుత్వం: తమ్మినేని

ఆమదాలవలస: తిరుమల ప్రతిష్టను కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తోందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం విమర్శించారు. మంగళశారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ ప్రసాదం కోసం వాడే పదార్థాల్లో నాణ్యత విషయంలో లోపభూయిష్టంగా ఉన్నట్లు అధికారులు గుర్తిస్తే సరఫరా చేసే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామన్నారు. నెయ్యి క్వాలిటీ విషయంలో టీటీడీ ప్రయోగశాలలో నిర్వహించినపరీక్షల్లో నాణ్యత సరిగాలేదని 18సార్లు వెనక్కి పంపించామన్నారు. దీనివెనుక ఉన్న కుట్రలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దుంపల రామారావు, బెజ్జిపురపు రామారావు, ఖండాపు గోవిందరావు, రాంబాబు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై సమాచారం సేకరించండి

పొందూరు: టీడీపీ హయాంలో మంజూరై వివిధ దశల్లో ఉన్న, వైసీపీ ప్రభుత్వంలో మంజూరుచేసిన ఇళ్ల నిర్మాణాల తీరుపై సంపూర్ణ సమాచారం సేకరించాలని జిల్లా హౌసింగ్ పీడీ బి.నగేష్ ఆదేశించారు. పొందూరులో వివిధ శాఖల అధికారులతో మన ఇళ్లు- మన గౌరవం కార్యక్రమంలో భాగంగా సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిహరరావు పాల్గొన్నారు.

ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలి

● జనసేనపార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్


అరసవల్లిలో సంఘీభావ దీక్ష చేపడుతున్న జనసేన నాయకులు

అరసవల్లి: తిరుమల లడ్డూను కల్తీచేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని, జరిగిన తప్పుకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని జనసేనపార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలతో కూడిన నెయ్యి వాడడంతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మంగళవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో సంఘీభావ దీక్షను చేపట్టారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూపతిరావు అర్జున్‌కుమార్, వడ్డిపల్లి జ్యోతిర్మయి, కీర్తి సుశీల, వారాది వరలక్ష్మి, మెట్ట వైకుంఠం, సురేష్, సైలాడ సతీష్ పాల్గొన్నారు.

లింగవివక్షపై అవగాహన కల్పించాలి

కలెక్టరేట్: బాలికలకు కళాశాలల్లో లింగవివక్షపై అవగాహన కల్పించాలని, ఇందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో లింగనిష్పత్తి, లింగ నిర్ధారణ చట్టం అమలుపై సబ్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది.ఈసందర్భంగా మాట్లాడుతూ స్కానింగ్‌కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలని, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో కమిటీ సభ్యులతో తనిఖీచేశారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో శ్రీకాంత్, కిరణ్‌కుమార్, స్వీప్ కె.రమణమూర్తి, స్వచ్ఛంద సేవకులు మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

భాషపై పట్టుసాధిస్తే ఉజ్వల భవిత

ఎచ్చెర్ల: భావవ్యక్తీకరణ, బాషపై పట్టు సాధిస్తే ఏ రంగంలోనైనా ఉజ్వల భవిత సాధ్యమని వాల్వో కార్లు కంపెనీ సీనియర్ ఇంజనీర్ కంచరాన సహజ (స్టాక్‌హోమ్, స్వీడన్) తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎంకాం, ఎంబీఏ విద్యార్థులనుద్దేశించి మంగళవారం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వర్సిటీ ఈ విభాగం కోఆర్డినేటర్ సంతోష్ రంగనాథ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థి అప్పగింత


తండ్రితో బాలుడు గౌతమ్

తిరుపతి(నేరవిభాగం): హాస్టల్ నుంచి పారిపోయి వచ్చిన విద్యార్థిని తిరుపతి వెస్ట్ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన మంగళవారం జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.... శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన గౌతమ్(13) విశాఖలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 23న తిరుమలకు వెళ్లాలని భావించి హాస్టల్‌లో ఎవ్వరికీ చెప్పకుండా రైలులో తిరుపతికి వచ్చాడు. ఈ క్రమంలో ఆ బాలుడు అలిపిరి వద్ద ఒంటరిగా వెస్ట్ పోలీసులకు కనపడ్డాడు. వారు ఆ బాలుడిని విచారించగా వాస్తవాలు చెప్పడంతో జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియచేసి, వారిని తిరుపతికి రప్పించారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెంటలో అసిరితల్లి చెవిటిపోలమ్మ ఉత్సవాలు

జి.సిగడాం: మండలంలోని పెంటలో అసిరితల్లి చెవిటిపోలమ్మ అమ్మవారి ఉత్సవాలు పూజారి మక్కనారాయణరావు, మక్క విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. పెంటతో పాటు పాత పెంట, నాగులవలస, లింగాపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న అమ్మవారి వనం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు పసుపు, కుంకుమ, ముర్రాటలు, చీరలు చెల్లించుకొని మొక్కులు తీర్చుకున్నారు ముందుగా బండార్లమ్మ అమ్మవారికి వేపకొమ్మలు, ముర్రాటలు చెల్లించుకున్నారు.

అసిరితల్లి అమ్మవారికి చల్లదనం

గార: కళింగపట్నం పంచాయతీ నగరాలపేటలో మంగళవారం అసిరితల్లి అమ్మవారికి గ్రామస్థులు ముర్రాటలు సమర్పించారు.ఏటా ఖరీఫ్ వరి దమ్ములు, నాట్లు పూర్తయిన తరువాత దసరా ముందు మంగళవారం అమ్మవారికి చల్లదనం చేయడం ఆనవాయితీగా వస్తోంది.ఈనేపథ్యంలో మంగళవారం మహిళలు, మేళతాళాలతో అమ్మవారి ఆలయంలో చల్లదనం చేశారు.


జి.సిగడాం: అసిరితల్లి చెవిటిపోలమ్మ తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

న్యాయం చేయాలని వినతి

శ్రీకాకుళంక్రైం: గంగమ్మ ఒంపల్లికి చెందిన గొర్లె చిన్నవాడుని మృతికికారణమైన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు గంగమ్మ తదితరులు కోరారు.ఈ మేరకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి మంగళవారం గంగమ్మ ఒంపల్లి గ్రామస్థులు వినతి పత్రం అందించారు.

బాధితురాలికి న్యాయం చేస్తాం: సీఐ

శ్రీకాకుళంక్రైం: జిల్లా వైద్యారోగ్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళను నుంచి రూ.రెండు లక్షలు వసూలుచేసి నకిలీ నియామకపత్రం ఇచ్చి మోసం చేసిన ఘటనలో బాధితురాలికి న్యాయం చేస్తామని శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు తెలిపారు. మీకోసం పరిష్కారవేదికలో బాధితురాలి కుటుంబసభ్యులు ఎస్పీని కలిశారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం సీఐ పైడపునాయుడు బాధితురాలిని విచారణ నిర్వహించారు.

కంచిలి మండల సమావేశం

కంచిలి: కంచిలి మండల పరిషత్ సమావేశం మంగళవారం ఎంపీపీ దేవదాస్ రెడ్డి అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు కార్యక్రమాలను వివరించారు. కార్య క్రమంలో ఎమ్మెల్యే నర్తు రామారావు, ప్రత్యేకాధికారి జయరాజ్, ఎంపీడీవో నీరజ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంఈవోలు శివరాం ప్రసాద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆంగ్లఉపాధ్యాయుడు ఆర్‌వీరమణ మూర్తికి మంగళవారం హెచ్‌ఎం కె.రామకృష్ణారావు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఇటీవల ఆయనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

పొందూరు: కింతలి గ్రామపరిధిలో 48-17 సర్వేనంబరులో ప్రభుత్వభూమిలో పంచాయతీ, ప్రభుత్వ అనుమతి లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించాలని మాజీ సర్పంచ్ దవళ గణపతి కోరారు.ఈ మేరకు మంగళవారం జేసీకి వినతిపత్రం అందజేశారు.


నేడు డీవార్మింగ్ డే

అరసవల్లి: నులిపురుగులను నివారించేందుకు పిల్లలందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని డీఎంహెచ్‌వో బి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న డీవార్మింగ్ డేను నిర్వహించామని, ఆ రోజు మాత్రలు వేసుకోని వారికి బుధవారం డీవార్మింగ్ డే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సరుబుజ్జిలి: వీరమల్లిపేటకు చెందిన పిడుగుపాటు మృతుడి కుటుంబానికి నాలుగు లక్షల రూపాయలను ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం అందించారు. 2021లో మల్లిబోయిన ప్రవీణ్‌కుమార్ పిడుగుపాటుకు గురై మృతిచెందిన విషయం విదితమే. మేరకు ప్రభుత్వం మంజూరుచేసిన ఆర్థికసాయాన్ని ప్రవీణ్‌కుమార్ తల్లి నాగమణికి అందించారు.

శ్రీ శివానీ ఫార్మసీకి నాక్ ఏ గ్రేడ్


నాక్ ఏ గ్రేడ్ పత్రాలను ప్రదర్శిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్య ప్రతినిధులు

ఎచ్చెర్ల: శ్రీశివానీ ఫార్మసీకళాశాల (చిలకపాలెం) నాక్ ఏ గ్రేడ్ సాధించింది. మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజ్‌కిరణ్ విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 13,14 తేదీల్లో ముగ్గురు సభ్యులతో కూడిన నాక్ బృందం కళాశాలను సందర్శించి మౌలిక సదుపాయాలు, లేబరేటరీ, సిబ్బంది పనితీరును పరిశీలించిందని తెలిపారు. ఇక్కడి సాంస్కృతిక కార్యక్రమాల తీరుపై బృందం సంతృప్తి వ్యక్తంచేసిందన్నారు. ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించడంతోనే నాక్ ఏ గ్రేడ్ సాధ్యమైందన్నారు.కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులువెంకటరావు, కె.దుర్గాశ్రీని వాస్, ఎస్.శ్రీనివాసరావు,ఇంజనీరింగ్‌కళాశాలప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే పథకాలు: రవికుమార్

సరుబుజ్జిలి: టీడీపీ హయాంలో బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మండలంలోని చిన్నకాగితాపల్లి, సింధువాడ పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఏడీ బి.రాజగోపాలరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం, బూర్జ ఐసీడీఎస్ పీవో గీత, సూపర్‌వైజర్ రత్నాంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కాగితాపల్లి, ఎల్.కె.పల్లి, వీరభద్రపురంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో మురళీ మోహన్‌కుమార్, కూటమి నాయకులు చంద్రశేఖర్, పేడాడ రామ్మోహన్, సూర్యనారాయణ, కిల్లి సిద్ధార్థ, నందివాడ గోవిందరావు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: వీరభద్రపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఫ్లైఓవర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం: శిరీష

పలాస: కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ 11వ వార్డు పూజారివీధిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ త్యాడి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో నిర్వాసితులకు అన్యాయం జరిగిందని, వారికి న్యాయం చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ.. వైసీపీ హయాంలో పట్టాల మాయాజాలం చూపించారని, 120 మందికి స్థలాలిస్తామని చెప్పి మొండి చేయి చూపారన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వారికి పౌష్టికా హారం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, కోట్ని దుర్గాప్రసాద్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, కొరికాన శంకర్ పాల్గొన్నారు.

సంక్షోభం నుంచి సంక్షేమం వైపు.. బగ్గు

నరసన్నపేట: వందరోజులు కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సంక్షోభం నుంచి సంక్షేమం వైపు అడు గులు వేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందని, రాజకీయాలకు అతీతంగా పనులు చేపడతామ న్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ శంకరరావు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచ్‌లు గొద్దు చిట్టిబాబు, నేతలు ఉణ్న రాజశ్రీ, ఉణ్న వెంకటేశ్వరరావు, జామి వెంకట్రావు, బోయన ఆనంద్, సతీష్, బలగ ప్రహర్ష, ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఈవో ద్రాక్షాయిణి తదితరులు పాల్గొన్నారు. ● మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తాం: ఎంజీఆర్

పాతపట్నం: కూటమి ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. చంగుడి గ్రామంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సామా జిక పింఛన్ల పెంపు, డీఎస్సీ ప్రకటన, స్థానిక సంస్థలకు రూ.1452 కోట్లు మంజూరు వంటి చర్యలు తీసుకుందన్నారు. ఒకటో తేదీనే ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ అందించే చర్యలు చేపట్టింద న్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతుల్లో ఆనందం కలిగించిందని అన్నారు. ఈ సంద ర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్రజలకు సంతృప్తికర పాలన: శంకర్

అరసవల్లి: ప్రస్తుతం ప్రజలకు సంతృప్తికర పాలన అందుతోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో గల 18వ వార్డు కృష్ణా పార్కు జంక్షన్‌లో మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, ఉంగటి వెంకటరమణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారి తనిఖీ

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద రావు, డీఎస్పీ ఎస్.కిరణ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ సుగుణాకర్, డీఈఈ సీహెచ్ సత్యనారాయణ తదితరులు మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికలకు ముం దు అంతరకుడ్డ, పెసరపాడు, కిడ్నీ ఆసుపత్రి రోడ్లతో పాటు కేటీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనుల్లో అవకతవకలు జరిగాయని, నాణ్యత లోపించిందనే ఫిర్యాదులపై ఈ తనిఖీ చేపట్టారు. నిబంధనల మేరకు రోడ్డును తవ్వి అందులో ఎంత మేరకు తారు మిక్చర్ వేసారన్న విషయాలను పరిశీలించారు. సీసీ రోడ్డులో కూడా అదే ప్రమాణాలు తీసుకొని ల్యాబ్‌కు తరలిస్తున్నట్లు వారు తెలిపారు.



పెసరపాడు రోడ్డు నాణ్యతను తనిఖీ చేస్తున్న తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ

ఎమ్మెల్యేని కలిసిన విజిలెన్స్ ఎస్పీ

పలాస: ఎమ్మెల్యే గౌతు శిరీషను విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆమె ఆకాంక్షించారు. అదే విధంగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వజ్జ బాబూరావుని కూడా విజిలెన్స్ ఎస్పీ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనం సీజ్

పాతపట్నం: కమ్మలకొట్టు కూడలిలో మంగళవారం వాహనాల తనిఖీలో పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాతల వైపు నుంచి వాహనంలో ఏడు ఎద్దులను బలద సంతలో కొనుగోలు చేసి నారాయణవలస సంతలో అమ్మేందుకు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాహనాన్ని సీజ్ చేసి పశువులను విజయనగరం జిల్లా కొత్తవలస గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

తండ్రిపై తనయుడి దాడి

నందిగాం: తండ్రిని గాయపర్చిన తనయుడి ఘటన కణితూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కణితూరు గ్రామానికి చెందని అన్నెపు మోహనరావుకు ముగ్గురు కుమారులు. ఆస్తికి సంబంధించి చిన్న కుమారుడు విద్యానంద్ తండ్రితో మంగళవారం గొడవకు దిగాడు. ఈ ఘటనలో తండ్రిపై దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహ్మద్‌ఆలీ తెలిపారు. గాయపడిన మోహనరావును చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

రైలు కిందపడి యువకుడి మృతి

పాతపట్నం: కె.గోపాలపురం గ్రామ సమీపంలో గుణుపూర్ నుంచి రూర్కెలా వెళుతున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మృతుడు కె.గోపాలపురం గ్రామానికి చెందిన రేగేటి రాజేష్(28)గా గుర్తించారు. ఈయన విశాఖపట్నంలో బిజినెస్ చేస్తున్నాడని, అవివాహితుడని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ ఘటనపై గ్రామస్థులు సమాచారం మేరకు రైల్వే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లామని పోలీసులు తెలిపారు.

విస్తారంగా వర్షాలు

జలుమూరు: ప్రస్తుతం వరి చేను చిరుపొట్ట దశలో ఉన్నందున ఇప్పుడు పడే వర్షాలు మేలు చేకూరుస్తాయని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల మంగళవారం విస్తారంగా వర్షాలు పడ్డాయి. ఇదిలా ఉండగా కరకవలస కాలనీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అవయవదాత కుటుంబానికి సాయం

టెక్కలి: టెక్కలి మేజర్‌పంచాయతీలో ప్రైవేట్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ విద్యుత్ స్తంభంపై నుంచి జారిపడి బ్రెయిన్‌డెడ్ అయి మృతిచెందిన బాలరాజు కుటుంబ సభ్యులకు పలువురు ఆర్థిక సాయం అందించారు. విద్యుత్‌శాఖ సిబ్బంది రూ.1.50లక్షలు, అభయం యువజన సేవా సంఘం ప్రతి నిధులు రూ.50 వేలు, చర్మవ్యాధి నిపుణుడు లింగాల రమేష్ రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ మధురెడ్డి, సిబ్బంది, సేవా సంఘం ప్రతినిధులు దేవాది శ్రీనివాసరావు, లాడి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

సంతబొమ్మాళి: బోరుభద్రలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఏపీ హ్యూమన్ రైట్ జాయింట్ సెక్రటరీ చింతాడ చిన్నారావు మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ సచివాలయం పక్కన 40 సెంట్ల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన గుడ్ల వైకుంఠ రావు,గుడ్ల రాజేష్, గుడ్ల నర్సింహమూర్తి కబ్జా చేశారని, తక్షణం తగు చర్యలు తీసుకుని భూమిని పరిరక్షించాలని కోరారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు అండర్-14, 17 విభాగాల్లో మంగళవారం నిర్వహించారు. వివిధ క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి బాడాన నారాయణరావు, ఎంఎస్‌వోలు రామిరెడ్డి, జి.శ్రీనివాసరావు, సీహెచ్ వాసుదేవరావు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీలు ప్రారంభం

నరసన్నపేట: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం ప్రారంభించారు. నాలుగు మండలాలకు చెందిన 430 మంది బాలురు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. క్రీడాకారులకు జలుమూరు జడ్పీటీసీ మెండ విజయశాంతి రూ.40వేలు విలువ చేసే స్పోర్ట్సు జాకెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శిమ్మ చంద్రశేఖర్, పీస కృష్ణ, మెండ రాంబాబు, హెచ్ఎం సాయి శ్రీనివాసశర్మ, పీడీలు యాళ్ల పోలినాయుడు, రవి, భూషణరావు, జ్యోతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా స్ఫూర్తిని అలవరచుకోవాలి

పలాస: విద్యార్థి దశ నుంచి సేవా స్ఫూర్తి అలవరచుకోవాలని వక్తలు కోరారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అవగాహన సదస్సు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు జె.వెంకటలక్ష్మి, కె.నర్సింహమూర్తి, అధ్యాప కులు పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శాంతి హేమ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో దేశభక్తి

టెక్కలి: ఎన్‌సీసీ వల్ల దేశభక్తి పెరుగుతుందని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహించారు. వ్యక్తిగత క్రమశిక్షణ, శారీరక, మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత ఆత్మరక్షణ పెంపొందించుకోవచ్చన్నారు. ఈ ఎంపికల ప్రక్రియను శ్రీకాకుళం 14వ బెటాలియన్ సుబేదార్ రవికుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ విష్ణుమూర్తి, ఎల్‌టీ మురళీమోహన్, హవల్దార్ జీఎస్ రెడ్డి, ట్రైనర్ భుజంగరావు, పీడీలు లక్ష్మణమూర్తి, తేజేశ్వరి పర్యవేక్షించారు.

బాబూరావుకు శిరీష అభినందన

పలాస: టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావుకు ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొ రేషన్ చైర్మన్‌గా నియమించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో విధేయుడిగా ఉన్న ఆయనకు చైర్మన్ పదవి వరించడంతో టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బాబూరావుకు ఎమ్మెల్యే గౌతు శిరీష దుశ్శాలువా కప్పి సత్కరించారు. మరిన్ని పదవులు అలంక రించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు, తనకు చైర్మన్ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, నారా లోకేష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు కేటాయించిన పదవికి న్యాయం చేస్తానని, పార్టీ ఆదేశాలు పాటిస్తానన్నారు. అలాగే బాబూరావుకు కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడం పట్ల ఆ పార్టీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, తమ్మినేని గంగారామ్, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్, బడ్డ నాగరాజు, కౌన్సిలర్లు హర్షం వ్యక్తంచేశారు. ● **పలాసరూరల్:** ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీటీపీసీ) చైర్మన్‌గా టీడీపీ నేత వజ్జ బాబూరావును నియమించడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో పలాస మండల టీడీపీ అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు తదితరులున్నారు. ● **హరిపురం:** టీడీపీ సీనియర్ నేత వజ్జ బాబూరావుకు ఏపీ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై ఆ పార్టీ మండల నేతలు హర్షం వ్యక్తంచేశారు. హర్షం తెలిపిన వారిలో బావన దుర్యోధన, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, పుల్లా వాసు, గున్న శ్రీనివాసరావు, బిగున్నయ్య, మండల లచ్చయ్య, ఎం.నవీన్, రాజశేఖర్, తమిరి భాస్కరరావు, దేబాసిస్ పండా, తమ్మినేని ధనుంజయ తదితరులున్నారు.



బాబూరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే

జాబ్‌మేళాలో 48 మంది ఎంపిక

పలాస: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. 137 మంది విద్యా ర్థులు హాజరు కాగా వీరిలో 48 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ పైల జవహర్ తెలిపారు. జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వంశీకృష్ణ మాట్లాడుతూ. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నేరుగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని, వీటిని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి రవికుమార్, స్కిల్‌హబ్ సమన్వయకర్త సోమేశ్వర రావు, తేజేశ్వరరావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా నరసింహ ప్రసాద్ పండా

మెళియాపుట్టి: ఎంపీడీవోగా నరసింహ ప్రసాద్ పండాను నియమిస్తూ జడ్పీ సీఈవో మంగ ళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన తూర్పుగోదావరి జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లాకు రాగా మండలానికి కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన చంద్రకుమారిని పాతపట్నం బదిలీచేశారు.

వరద బాధితులకు ఉద్దానం మాజీ సైనికుల విరాళం

పలాసరూరల్: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఉద్దానం మాజీ సైనికులు రూ.21 వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీషకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్దానానికి చెందిన మాజీ సైనికులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి

కోటబొమ్మాళి: చిట్టివలస గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా పశువైద్య శిబిరం, దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పశువులకు నిర్వహిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాడి రైతులకు ప్రోత్సాహకాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త సంచాలకుడు ఆర్.మురళీధర్, జిల్లా పశుగణాభివృద్ధి శాఖ డీడీ సీహెచ్ సత్యప్రకాష్, డీడీలు వి.జయరాం, ఎం.లోకనాథం, సంపతిరావు భారతమ్మ, పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా పూజలు

నందిగాం: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీని నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన పశ్చాత్తాప దీక్షకు మద్దతుగా పెంటూరు వెంకటేశ్వర ఆలయంలో మంగళవారం జనసేన నేతలు ప్రత్యేక పూజలు చేశారు. ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు తాడేల చిరంజీవి నేతృత్వంలో పూజలు, హోమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లడ్డూకు వినియోగించే నెయ్యి కల్తీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.షణ్ముఖరావు, పి.సోమేశ్వ రరావు, త్రివేణి, వీరస్వామి, కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.



నందిగాం: ఆలయంలో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

● **పాతపట్నం:** తిరుపతి లడ్డూ కల్తీ హేయమైన చర్య అని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండిస్తు న్నారని బీజేపీ నేత డా.సలాన శరత్‌కుమార్ అన్నారు. లడ్డూ కల్తీపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన పశ్చాత్తాప దీక్షకు మద్దతుగా స్థానిక శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐదుమండలాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణలో లోపాలుంటే క్షమించేది లేదు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి శ్రీ కొత్తమ్మ తల్లి ఉత్సవాలు అక్టోబరు ఒకటి నుంచి 3 వరకు నిర్వహించనున్నందున ఉత్సవాల ఏర్పాట్లలో లోపాలుంటే క్షమించేది లేదని, సంబం ధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. మంగళవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గాలిగోపురం పనులు పూర్తి చేసి ఆలయానికి రంగులు వేయాలన్నారు. వాహనాల పార్కింగ్, సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించే ప్రదేశాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయానికి రెండుమీటర్ల మేర రేకుల షెడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. కొత్తపేట నుంచి కోటబొమ్మాళి చివరి వరకు విద్యుత్ అలంకరణ, అవసరం ఉన్న చోట సీసీ కెమెరాలు, బయో టాయిలెట్స్ ఏర్పాటుచేయాలన్నారు. వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదాలు, భోజనాలను అందజేయాలని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అంతకుముందు అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గడ్డెమ్మ, ఎంపీడీవో కె. ఫణీంద్ర కుమార్, తహసీల్దార్ అప్పలరాజు, ఈవో రాధాకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

డీలర్లకు నష్టం రాకుండా డిపోలను ఏర్పాటు చేయాలి

సంతబొమ్మాళి/కోటబొమ్మాళి/టెక్కలి: రేషన్ డీలర్లకు నష్టం రాకుండా, కార్డుదారులకు ఇబ్బంది లేకుండా రేషన్ డిపోలు ఏర్పాటు చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆరంగి రామారావు, ఎన్.రవి కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం నూతన కార్యవర్గ సభ్యులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. డిపోలు పునర్వ్యవస్థీకరణలో భాగంగా గ్రామాల్లో 600 కార్డులు, పట్టణాల్లో 800 కార్డులు తక్కువ లేకుండా ఉండేలా డిపోలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో కనీస వేతనం రూ.18500, పట్టణాల్లో రూ.24,500 అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పి.కోటేశ్వరరావు, కె.నాగరాజు, చిట్టయ్య, దానయ్య, అశిరినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడును నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి గౌతు శివాజీ దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజకీయ, కుటుంబ అంశాలపై మాట్లాడుకున్నారు. వారితో పాటు గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పీరుకట్ల విఠల్ ఉన్నారు. ● పట్టుపురం గ్రామానికి చెందిన కొత్తకోట కృష్ణారావు, కొత్తకోట వెంకటరమణ విజయవాడ వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి మంగవారం రూ.25 వేల చెక్కును మంత్రి అచ్చెన్నాయుడుకి అందించారు. మంత్రి పలువురి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

వరద బాధితులకు డీసీసీబీ రూ.5 లక్షల విరాళం

సంతబొమ్మాళి: విజయవాడ వరద బాధితులకు డీసీసీబీ ఉద్యోగులు ఒకరోజు జీతాన్ని విరాళంగా అందించారు. ఈ మేరకు మంగళవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును సంతబొమ్మాళి మండలం మూలపేటలో డీసీసీబీ సీఈవో వరప్రసాద్, జీఎం జగదీష్, డీజీఎం రమేష్, ఏజీయం దశరథ, కోటబొమ్మాళి బ్రాంచి మేనేజర్ ఉషాశాంతి కలుసుకున్నారు. అనంతరం రూ.5,02,846 చెక్కును మంత్రికి అందజేశారు. ఆపద సమయంలో మానవతా దృక్పథంతో ఆదుకునేందుకు ముందుకు వచ్చిన డీసీసీబీ ఉద్యోగులను మంత్రి అభినందించారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు చెక్కు అందజేస్తున్న డీసీసీబీ అధికారులు

భూ రీ సర్వే సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: కర్లెమ్మ పంచాయతీలో భూముల రీ సర్వేలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శిర్ల ప్రసాద్ రైతులతో కలిసి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అధికారులు గ్రామసభ నిర్వహించగా బాధిత రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రెవెన్యూ పరిధిలో రైతుల భూముల పేర్లు, మార్పులు, రికార్డులు తప్పులుగా నమోదు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. సమస్యలపై రైతుల నుంచి వినతిపత్రాలు కోరగా వారంతా విముఖత వ్యక్తంచేశారు. పాత పసల్ నెంబర్ 1433 ప్రకారం 2023లో ఉన్న అండగల్ మేరకు గుర్తించాలని, ఈ క్రాప్ నమోదుకు సమస్య లేకుండా చూడాలని రైతులు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాపారావు, సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ దాస్‌నాయుడు, రీ సర్వే డీటీ అనంత్‌కుమార్, యతిరాజు, రైతులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న శిర్ల ప్రసాద్

రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కల్పించండి

పాతపట్నం: రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలుకు పాతపట్నంలో హాల్ట్ కల్పించాలని పలువురు టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయు డును కలిసి వినతిపత్రం అందించారు. పాతపట్నంతో పాటు సారవకోట, నరసన్నపేట, హిరమండలం, కొత్తూరు మండలాల నుంచి ఒడిశా ప్రయాణికులకు ఈ రైలు ఎంతో ఉపయోగంగా ఉంటుం దన్నారు. తగుచర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, రుంకు చలపతిరావు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

మార్చి నాటికి పీఎంఏవై ఇళ్లు పూర్తిచేయాలి

కోటబొమ్మాళి: ప్రధానమంత్రి ఆవాస్ యోజనపథకం కింద మంజూరైన ఇళ్లను 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.గడ్డెమ్మ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్ అధ్యక్షతన పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల ఇంజనీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 28న అన్ని గ్రామ పంచాయ తీల్లో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు.

● **ఎల్.ఎన్.పేట:** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకంలో మంజూరైన ఇళ్లను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను గుర్తించి వాటిని పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈవోపీఆర్డీ ఐ.పద్మజ, డీటీ రషీద్ అహమ్మద్, వ్యవసా యాధికారి పి.లత్మశ్రీ, పశువైద్యాధికారి జి.కవిత, హౌసింగ్ ఏఈ రమేష్ పాల్గొన్నారు. ● **పోలాకి:** గత టీడీపీ హయాంలో అమలుచేసిన ఎన్టీఆర్ గృహనిర్మాణం కాలనీల లబ్ధిదారుల జాబితా ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి టి.మురళీకృష్ణ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ ఇంజనీర్లు, సచివాలయ, ఎన్ఆర్ఈజీఎస్, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం లో మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో ఇళ్లమంజూరు లబ్ధిదారులు, బిల్లుల చెల్లింపు జాబితాలను అందించా లన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో బలగసూర్యప్రకాష్, ఈవోపీఆర్డీ బట్టి పద్మావతి పాల్గొన్నారు.

APSRTC
టెండరు ప్రకటన
శ్రీకాకుళం జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, ఖాళీ స్థలము/ఫాస్ట్ ఫుడ్ ... వ్యాపారములు చేసుకొనుటకు మరియు గ్యారేజీలలో వివిధ రకాల పనులు ... దీ. 25-09-2024 నుండి దీ. 08-10-2024 వరకు ... ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు దీ. 09-10-2024న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, శ్రీకాకుళం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ : https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఏదీ కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.
నెం.P2/437(04)/2024-DPTO/SKLM, తేది: 23-09-2024 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, శ్రీకాకుళం.







WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. Ph:9160900024 / 9640400073
AJH-15243

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరు కైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు
ACM : 99854 11514
ACO-1 : 99854 00079
ACO-2 : 99854 11535
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మింపబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ సంప్రదించాల్సిన నెంబర్లు:
శ్రీకాకుళం: 9985465497, నరసన్నపేట: 9985425891
టెక్కలి: 9949607029,పలాస: 9985411524
సోంపేట: 9989281099,రాజాం : 9573179776